ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 18 డిసెంబరు 2024

బతికున్న దేవెగౌడ ఫొటో పెట్టమంటే ఎలా? : స్పీకర్

బెంగళూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జీవించి ఉన్న మాజీ ప్రధాని దేవెగౌడ ఫొటో ఏర్పాటు చేయాలంటే ఎలా అని స్పీకర్ యుటీ ఖాదర్ మండిపడ్డారు. బెళగావి శాసనసభలో పలువురి ప్రముఖుల ఫొటోలను సోమవారం ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై జేడీఎస్ నేత సురేశ్‌బాబు చిత్రపటాల ఆవిష్కరణకు తమ పార్టీ నేతల్ని ఆహ్వానించలేదన్నారు. కర్ణాటక నుంచి ప్రధానిగా పని చేసిన దేవెగౌడ ఫొటో కూడా ఉండాల్సిందన్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ దేవెగౌడ అంటే అపారమైన గౌరవమని, కానీ జీవించియుండగానే ఫొటో వేయాలంటే ఎలాగని ప్రశ్నించారు.


ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

అంగన్‌వాడీల నిరసన
- గౌరవ వేతనం పెంచాలి..
- ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్

8



ఏనుగుల సంచారంతో బెంబేలు
పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల మంద

8



ఐడెక్‌కు బాధ్యతలు
- రెండో విమానాశ్రయ ఏర్పాటు అధ్యయనానికి..
- భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్

7

వైద్యం అందకే మృత్యువాత

- బిమ్స్ డైరెక్టర్, డాక్టర్ల మధ్య వర్గపోరు
- రోగులకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం
- విధానసభలో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి



బళ్లారి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మెడికల్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బిమ్స్) లో వైద్యం కోసం వచ్చే రోగులకు సరిగ్గా వైద్యం అందడం లేదని, ప్రభుత్వం ఏటా ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తున్నా డైరెక్టర్, డాక్టర్ల మధ్య ఉండే వర్గ పోరు మూలంగా వైద్య సేవలు అందడం లేదని అధికార పార్టీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి విధాన సభ సమావేశంలో ధ్వజమెత్తుతున్నారు. బెళగావిలో జరుగుతన్న శీతాకాల శాసనసభ సమావేశాల్లో బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ప్రశ్నోత్తరాల సమయంలో సమస్యను లేవనెత్తారు. బిమ్స్ ఆసుపత్రికి వైద్యం కోసం ప్రభుత్వ ఏటా రూ. కోట్లు నిధులు విడుదలు చేస్తోందని, అయినా సరైన వైద్యం అందడం లేదన్నారు. సిటీస్కాన్, ఎక్స్‌రే మిషన్లు మరమ్మతులో ఉన్నాయన్నారు. ఆసుపత్రి రికార్డుల్లో 14 డయాబెటీస్ పరిక్షించే మిషన్లు ఉన్నట్లు రికార్డులో ఉన్నా కేవలం నాలుగు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. పేదలని చూడకుండా రోగులను పరీక్షల కోసం బయటికి పంపుతున్నారని, డబ్బులు లేని రోగులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలవర్గం మధ్య విబేధాలతోనే వైద్యం అందడం లేదని, పూర్తీ ఆధారాలను సభలో ప్రవేశపెట్టారు. బళ్లారి జిల్లా పేదలకు సంజీవని అయిన వైద్యశాలను పరిరక్షించాలని, నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. బాలింతల మృతితో ఆస్పత్రిపై అపనమ్మకం ఏర్పడిందన్నారు. సరైన వైద్యం అందకే బాలింతలు మృతి చెందారన్నారు. ఇందుకు వైద్యశాఖ మంత్రి సుధాకర్ సమాధానం ఇస్తూ బిమ్స్ పై అనేక ఆరోపణలు ఉన్నాయని వీటిపై విచారించి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. విధానసభ సమావేశంలో ఒక అధికార పార్టీ ఎమ్మెల్యేనే బిమ్స్‌లో జరుగుతున్న అంశం పై లేవనెత్తడం చర్చనీయాశం అయింది. సీఎం కూడా తక్షణమే బిమ్స్‌లో జరుగుతున్న అక్రమాలు గుర్తించేందుకు కమిటీ నియమిస్తున్నట్లు తెలిపారు. దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.



సువర్ణసౌధ వద్ద సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్, కేసీ వేణుగోపాల్, సీఎం సిద్దరామయ్య, రణదీప్‌సింగ్ సుర్జేవాలా

దేశ రాజకీయాల్లో కొత్త మలుపు

- బెళగావి కాంగ్రెస్ సభతో పార్టీలో ఉత్తేజం
- బీజేపీది అవకాశవాదం
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

బెంగళూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ అధ్యక్షతన బెళగావిలో జరిగిన కాంగ్రెస్ సభకు వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ కార్యవర్గ సభ దేశ రాజకీయాలు, కాంగ్రెస్ పోరాటానికి కొత్త మలుపు కానుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. బెళగావి కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ శతమానోత్సవానికి సంబంధించి సన్నాహకసభ మంగళవారం జరిగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, అజయ్‌మాకెన్ తదితరులు పాల్గొన్నారు. సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కేసీ వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ మహాత్మాగాంధీ కేవలం ఒకసారి మాత్రమే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. ఈ అధికారాన్ని 1924 డిసెంబరు 26న బెళగావిలో జరిగిన సభలో స్వీకరించారన్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి వందేళ్లు పూర్తి అవుతున్న సంబరాన్ని ప్రతి కార్యకర్త గర్వంగా భావిస్తున్నారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ అనేక సందేశాలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ ఆయన పరంపర, ప్రతి కార్యకర్త మనస్సులో గర్వకారణమన్నారు. గాంధీజీ అహింసామార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. ప్రస్తుతం దేశంలో సమానత్వం లేదని, శ్రీమంతులు మరింత పెరుగుతున్నారని, పేదలు వెనుకబడి పోతున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు విక్రయాలు జరుగుతున్నాయని, దేశంలో అన్ని ఆస్తులు ఒకే వ్యక్తి చేతికి వెళ్తున్నాయన్నారు. పేదలకు రక్షణ లభించాలంటే పోరాటం తప్పదన్నారు. బీజేపీ దేశంలో ద్వేషపూరితమైన మార్కెటింగ్ చేస్తోందని, మతం పేరిట ద్వేషాన్ని రగులుస్తోందన్నారు. అదే వారి అజెండా అన్నారు. ప్రస్తుతం ప్రజాప్రభుత్వ విలువలను హైజాక్ చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. బెళగావిలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకోదలిచామన్నారు. మధ్యాహ్నం 3గంటలకు కార్యవర్గ సభ జరుగుతుందన్నారు. శాశ్వత ఆహ్వానితులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల అధ్యక్షులతోపాటు ప్రముఖులంతా పాల్గొంటారన్నారు. 27న బహిరంగసభకు లక్షలాదిమంది పాల్గొంటారన్నారు. ఇదంతా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే జరిగేలా ఏఐసీసీ సూచించిందన్నారు. సభా ప్రాంగణంలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈస్ట్-ఇండియా కంపెనీకి 'మో'దాని కంపెనీకి వ్యత్యాసం లేదన్నారు. మీడియా ప్రశ్నకు సమాధానంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులను బీజేపీ తనకు అనుకూలం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఒక దేశం - ఒక ఎన్నిక వారి అజెండా అని, వారికి ప్రజాప్రభుత్వం విలువల గురించి తెలియదన్నారు. స్పీకర్ యుటీ ఖాదర్, మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, హెచ్‌కే పాటిల్, సతీశ్ జార్కిహొళి తదితరులు పాల్గొన్నారు.


సువర్ణసౌధ వద్ద నేతలు..

టూరిజం కేంద్రంగా మార్చారు

- సమావేశాల పేరుతో బెళగావి పరువు తీశారు
- సర్కారు సొమ్ముతో టీ కూడా తాగను
- జేడీఎస్ ఎమ్మెల్యే శరణగౌడ కందకూరు ఆగ్రహం



బెంగళూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాల ముసుగులో బెళగావితోపాటు ఉత్తర కర్ణాటక ప్రాంతాలను ప్రభుత్వం టూరిజం కేంద్రంగా మార్చిందని జేడీఎస్ ఎమ్మెల్యే శరణగౌడ కందకూరు మండిపడ్డారు. శాసనసభలో ఉత్తర కర్ణాటక అంశాలపై శరణగౌడ మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక అంశాలపై సమగ్ర చర్చకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడం లేదన్నారు. అందుకే ప్రభుత్వం నుంచి తాను ఎలాంటి సౌకర్యాలు పొందనని, కనీసం ఇక్కడ కాఫీ, టీకూడా తాగేది లేదని స్పష్టం చేశారు. ఉత్తరకర్ణాటకపై చర్చలో భాగంగా తనకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపేది లేదన్నారు. అది తమ హక్కు అన్నారు. కానీ బెళగావిలో శాసనసభ కలాపాల పేరిట పర్యాటక కేంద్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిరోజుల కలాపాలలో ఒకరోజు కుదించారన్నారు. ఉత్తర కర్ణాటక నుంచి 91మంది ఎమ్మెల్యేలు ఉన్నారని వీరిలో 41మంది కల్యాణ కర్ణాటక, 50మంది కిత్తూరు కర్ణాటక వాసులన్నారు. బెళగావిలో శాసనసభ కలాపాలకు రూ.25కోట్లు ఖర్చు చేస్తారన్నారు. వచ్చే ఏడాది ప్రభుత్వ సౌకర్యాలు పొందేది లేదని సొంత ఖర్చులతో వచ్చి వెళ్తామన్నారు. గడిచిన శాసనసభ సమావేశాలలో ఈ ప్రాంత సమస్యలపై సుదీర్ఘంగా మాట్లాడానని నియోజకవర్గ ప్రజలు, సోషల్‌మీడియా, పత్రికలు, టీవీ చానళ్లలో ఒకరోజు ప్రసారమై నాయకుడు అయ్యానన్నారు. కానీ తాను ప్రతిపాదించిన పనులు ఏవీ జరగలేదన్నారు. ఉత్తర కర్ణాటకపై పాలకులకు నిర్లక్ష్యం నెలకొందని, ఎన్ని ఉద్యమాలు చేసినా నేతల్లో మార్పు రావడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరితోనే ప్రత్యేక రాష్ట్ర నినాదం మొదలయ్యిందని, ఇప్పటికైనా సీఎం తన తీరు మార్చుకుని ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల పేరిట వసూళ్ల దందా సాగుతోందన్నారు. యాదగిరి జిల్లాలో ఎటువంటి పరిశ్రమలు లేవని విచారం వ్యక్తం చేశారు. ఇక్కడ ఉద్యోగాలు లేక యువత వలసబాట పట్టారని, ఎన్నో గ్రామాలు జనాలు లేక బోసిపోతున్నారన్నారు. కేవలం బెంగళూరు పరిసరాలకే అభివృద్ధి కేంద్రీకృతం కావడం సరి కాదన్నారు. పైగా ఇక్కడి ఆసుపత్రిలో ఐదుగురు బాలింతలు మృతి చెందారన్నారు. మాటల మధ్యన నియోజకవర్గంలో పర్యటిస్తే ప్రజలు తుపాకీతో కాలుస్తారన్నారు. ఆ తర్వాత ఆవేశంలో మాట్లాడానని తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు.

వృక్షమాతకు ఉభయసభల నివాళి



బెంగళూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ ప్రేమి, వృక్షమాతగా పేరొందిన పద్మశ్రీ గ్రహీత తులసిగౌడ మృతి పట్ల శాసనసభ ఉభయసభలు మంగళవారం సంతాపం ప్రకటించాయి. శాసనసభ స్పీకర్ యుటీ ఖాదర్ కలాపాలు ప్రారంభం కాగానే తులసిగౌడకు సంతాపం తెలిపారు. సీఎం, డీసీఎంలతోపాటు ప్రతిపక్షనేత అశోక్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. పరిషత్‌లో సభాపతి బసవరాజ హొరట్టి మాట్లాడుతూ తులసిగౌడ మృతి పట్ల విషాదం వ్యక్తం చేశారు. 1944 డిసెంబరు 16న అంకోలా తాలూకా హొన్నళ్ళిలోని హాలక్కి ఆదివాసి తెగలో తులసిగౌడ జన్మించారన్నారు. ఆమె జీవితకాలం మొక్కల సంరక్షణకే అంకితమయ్యారన్నారు. ఏటా 30వేల మొక్కలను నాటి సంరక్షించేవారన్నారు. అటవీప్రాంతంలో అన్ని చెట్లపేర్ల గురించి ఆమెకు తెలుసునన్నారు. ఆమె ఓ పర్యావరణ రాయబారిలాగా వ్యవహరించి ఉత్తర కన్నడ జిల్లాలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చారన్నారు. పర్యావరణంపై ప్రేమ పెంచుకున్న ఆమె తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఆమె లేకున్నా చెట్లను కాపాడి ఆమె ఆశయాన్ని కొనసాగించాలన్నారు. సభా నాయకుడు బోసరాజు, ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి సహా పలువురు సంతాపం తెలిపారు. అనంతరం సభ్యులు ఆమెకు నివాళి అర్పించారు.

కోతల కాలం..!


- వరి కోత యంత్రాలకు డిమాండ్
- భారీగా పెరిగిన ధరలు


వరి పంటను తొలగిస్తున్న యంత్రం

కంప్లి, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : వరి రైతుకు వరుస కష్టాలు వేధిస్తున్నాయి. ఓ వైపు ధరలు లేక, దిగుబడి రాక ఇబ్బంది పడుతుంటే మరో వైపు వరికోత యంత్రాల ధరలు భారీగా పెంచేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కోతలు పెరిగిపోయాయి. తు ఫాన్ హెచ్చరికలతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. వరికోతలకు రైతులు తొందర పడుతున్నారు. దీంతో ధరలు విపరీతంగా పెంచేశారు. ఈ విషయంపైన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప మాట్లాడుతూ గతంలో జిల్లా అధికారులు ప్రశాంత్ కుమార్ మిశ్రా కోత మిషన్ల ధరల పెంపకంపై ఆగ్రహం వ్యక్తం చేశారని, గంటకు 2300 రూ. 2500 మధ్యే చెల్లించాలని ఆదేశించారన్నారు. కానీ మిషన్ల యాజమానులు రూ. 3 వేలు నుంచి రూ. 3500 వరకు వసూలు చేస్తున్నారని వాపోయారు. వరి రైతుల ఇప్పటికే పూర్తీగా నష్టపోయారని, పెరిగిన ధరలతో మరింత నష్టాలపాలవుతారన్నారు. తాలుకా పరిధిలోని దేవలాపురం, సుగ్గినళ్లి, మావినళ్లి, వన్నళ్లి, దేవసముద్రం, చిక్కజాగనూరు తదితర గ్రామాల్లో పంటలు ఇప్పటికే నేలకొరిగాయి. పలు చోట్ల రైతులు కోతలకు సిద్ధమయ్యారు.

సమస్యలు అపారం..!

- సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు
- విద్యార్థులకు తప్పని కష్టాలు
- తల్లిదండ్రుల ఆగ్రహం





బెంగళూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక నుంచి పీయూ వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థల విద్యార్థులందరి సమగ్ర సమాచారాన్ని సేకరించే 'అపార్' నమోదుకు రాష్ట్ర వ్యాప్తంగా అపారమైన సమస్యలు అడ్డంకిగా మారుతున్నాయి. 'అపార్' అనగా ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ. 2020లో కేంద్రప్రభుత్వ జాతీయ విద్యావిధానంలో భాగంగా 'వన్ నేషన్ - వన్ నేషన్ ఐడీ'ని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇదే అమలు చేస్తున్నారు. విద్యార్థుల సమగ్ర వివరాలను ఆధార్ తరహాలో 'అపార్'లో నమోదు చేస్తారు. పుట్టినతేదీ, పేరు, ఇతరత్రా వివరాలను పొందుపరుస్తారు. అపార్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేస్తే ప్రాథమిక నుంచి పీయూ వరకు ఎక్కడ చదివారు, ఉత్తీర్ణత, మార్కుల వివరాలతోపాటు సమగ్ర సమాచారం పొందుపరుస్తారు. కేంద్ర విద్యాశాఖ పర్యవేక్షించే (యుడైస్ ప్లస్) యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ వెబ్‌ద్వారా అపార్ వివరాల నమోదుకు మార్పులు చేస్తే తప్ప సాధ్యం కాదని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల ప్రొఫైల్స్‌ను పూర్తిస్థాయిలో అపార్‌లో నమోదు చేయడం ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పెనుసవాల్‌గా మారుతోంది. ప్రారంభంలో సులువుగానే అమలు చేశారు. ప్రస్తుతం యుడైస్‌లో డేటా నమోదు చేస్తేనే అపార్ అప్‌డేట్ చేయడం సాధ్యమవుతోంది. అయితే రెండింటినీ కేంద్రప్రభుత్వమే పర్యవేక్షిస్తున్నందున సమస్య పరిష్కారం కూడా వారే చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ విన్నవించింది.

యుడైస్‌లో భాషా సమస్య

విద్యార్థుల ప్రొఫైల్, లాగిన్ చేసేందుకు ఎన్‌రోల్‌మెంట్ కాలంలో విద్యార్థి చదివిన భాషను నమోదు చేయడం తప్పనిసరి. ఈ ప్రక్రియను అధిగమిస్తేనే తదుపరి అప్లికేషన్‌లోని వివరాలను పొందుపరిచేందుకు సాధ్యమవుతోంది. భాష నమోదు చేసే విషయంలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రాథమిక, హైస్కూల్ విభాగంలో సాఫ్ట్‌వేర్‌లో కన్నడ, హిందీ, ఇంగ్లిష్ మాత్రమే అవకాశం ఉంది. దాదాపు రాష్ట్రమంతటా ప్రతిపాఠశాలలోనూ సంస్కృతం చదివినవారు ఉన్నారు. ఇక తీరప్రాంతంలో తుళు, కొంకణితోపాటు మరిన్ని భాషలలో చదివిన విద్యార్థుల అపార్ నమోదు సాధ్యం కావడం లేదు. ఇక పీయూసీ విద్యార్థులకు మూడు సబ్జెక్టులతోపాటు మళయాళం, ఫ్రెంచ్, అరబిక్ భాషలకు అవకాశం ఇవ్వలేదు. కన్నడ, హిందీ, ఇంగ్లిష్ మాత్రమే అప్లికేషన్‌లో ఉండడంతో సమస్య నెలకొంది. ఈ మూడు భాషలు మినహా మిగిలిన లాంగ్వేజ్‌లలో చదివిన విద్యార్థులకు అపార్ నమోదు సమస్యగా మారింది. చాలామంది విద్యార్థుల పేర్లు ఆధార్ కార్డుకు యుడైస్‌లో నమోదు చేసిన వివరాలకు పొంతన కుదరడం లేదు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని భావించి విద్యార్థులు ముందుకొచ్చినా ఆధార్ అప్‌డేట్ సకాలంలో కావడం లేదు. ఓవైపు విద్యార్థులు తరగతులను వదిలి నమోదులకోసం రోజుల తరబడి వేచియుండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు ఇదో సవాల్‌గా మారింది. రాష్ట్రంలో అపార్ ప్రారంభదశలోనే కుంటుపడింది.

ఎస్‌ఏటీఎస్‌తో అనుసంధానానికి యత్నం

హైస్కూల్ విద్యార్థి అపార్ నమోదు చేసుకుంటే స్టూడెంట్ అచీవ్‌మెంట్ ట్రాక్ సిస్టమ్ (ఎస్ఏటీఎస్) విధానంతో సదరు విద్యార్థి ప్రాథమిక స్థాయిలో ఏ ప్రాంతంలో ఏ విద్యాసంస్థలో ఏ భాషలో చదివాడు. ఆ తర్వాత మార్పులు, విద్యాసంస్థల మార్పు వంటి సమగ్ర వివరాలు ఉంటాయి. దీన్నిబట్టి ఉన్నత విద్యకు ఎంపిక చేసే సమయంలో ఎంతకాలంగా రాష్ట్రంలో చదువుతున్నారో తేలిపోనుంది. కామెడ్-కె, సీఈటీ పరీక్షల వేళ తలెత్తే నాన్ లోకల్ అనే సమస్యకు పరిష్కారం లభించనుంది. విద్యార్థులు, తల్లిదండ్రులకు సమగ్ర సమాచారం అందించాలని కోరుతున్నారు.

తవుడు లారీ బోల్తా

- ముగ్గురు ఉద్యోగుల దుర్మరణం

రాయచూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తవుడు లారీ బోల్తా పడి ముగ్గురు ఉద్యోగులు దుర్మరణం పాలయ్యారు. జిల్లాలోని సింధనూరు పట్టణం పీడబ్ల్యూడీ క్యాంప్ డాలర్స్ కాలనీ సమీపంలో సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వేగంగా వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో రోడ్డు పక్కన ఆగి మాట్లాడుకుంటున్న ఇద్దరు ఇంజనీర్లు, మరో ఉద్యోగి దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని డాలర్స్ కాలనీ సమీపంలో నీటి పారుదల శాఖలో పని చేస్తున్న సీనియర్ ఇంజనీర్ శివరాజ్ రాంపూర్(28), మల్లికార్జున్ సర్జాపూర్(29) మరో ఉద్యోగి కంప్యూటర్ ఆపరేటర్ మహబూబ్(36)మృతి చెందినవారు. ముగ్గురూ రెండు బైకులు రోడ్డు పక్కన ఆపి ఇంటికి వెళుతున్న క్రమంలో మాట్లాడేందుకు ఆగారు. అదే సమయంలో అటువైపు వరి తవుడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి అకస్మాత్తుగా బొల్తా పడింది. బొల్తా పడిన లారీ ఈ ముగ్గురి పై పడడంతో తవుడు సంచుల్లో ఇరుక్కుని ఊపిరాడక అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. విషయం తెలుసుకున్న సింధనూరు ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ తాగిన మత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన డ్రైవర్, క్లీనర్‌లను చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. మృత దేహాలను పోస్ట్‌మార్టం కోసం సింధనూరు నగరంలోని తాలూకా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


మహబూబ్, మల్లికార్జున్, శివరాజ్ (ఫైల్)



బసంపల్లిలో చీనీకి సోకిన తెగులు

పంటలకు చీడ పీడలు

పట్టించుకోని ఉద్యాన శాఖ అధికారులు

శెట్టూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సాగు చేసిన ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతు న్నారు. మండలంలో రైతులు మామిడి పంటను దాదాపు వెయ్యి ఎకరాలు, చీనీ వంద ఎకరాలకు పైబడి, టమోటా 200 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. వీటితో పాటు సపోటా, దానిమ్మ, అల్ల నేరేడు, బీర తదితర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పొగమంచు విపరీతంగా ఉండటంతో మామిడికి తేనెమంచు పురుగు ఆశించింది. చీనీకి పచ్చ పురుగు, ఆకు మచ్చ తెగుతు సోకింది. టమోటాను కాయతొలుచు పురుగు, పచ్చపురుగు, మచ్చ తెగులు ఆశించాయి. వీటి నివారణకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో చీడపీడల నివారణకు ఎలాంటి మందులు వాడాలో తెలియక రైతులు ఎరువుల దుకాణదారులను ఆశ్రయిస్తున్నారు. వారిచ్చే సలహాలమేరకు పురుగు మందులు తెచ్చి పిచికారీ చేస్తున్నారు. అయినా తెగుళ్ల అదుపులోకి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఉద్యాన రైతులకు ఉద్యాన శాఖ అధికారులను అందుబాటులో ఉంచేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తెగులు సోకిన ఆకు

అంతా హోల్‌సెల్

శిక్షణ కార్యక్రమంలో సెల్ ఫోన్లతో బిజీ బిజీ

అందరూ సెల్‌ఫోన్‌లోనే కాలక్షేపం చేస్తుంటే మరి చెప్పేది వినేవారెవరు? శిక్షణ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని నెరవేర్చేదెవరు? శిక్షణలో చెప్పేది వినకపోతే రేప్పొద్దున క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇవన్నీ ఆ ఉద్యోగులకు ఏమీ పట్టలేదు. ఏదో కాలక్షేపానికి వచ్చాం అన్నట్లుగా సెల్‌ఫోన్ చూస్తూ ఉండిపోయారు. ఇదీ.. నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం తీరు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామాభివృద్ధి ప్రణాళిక, పేదరికం, బాల్యవివాహాల నిర్మూలనపై ఎంపీడీఓ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గదిలో ఎంపీడీఓ శిక్షణ ఇస్తుండగా... వచ్చిన ఉద్యోగుల్లో ఎక్కువమంది కార్యక్రమాన్ని పక్కన పెట్టి సెల్ ఫోన్లతో బిజీబిజీగా కాలం గడిపారు. సదుద్దేశంతో పెట్టిన ఈ కార్యక్రమానికి హాజరైన కొందరు ఉద్యోగులు సెల్‌ఫోన్‌లో మునిగిపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు సెల్‌ఫోన్ స్విచ్ఆఫ్ చేయిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

\- నార్పల





ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పది విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక

డీఈఓ ప్రసాద్‌బాబు



అనంతపురం విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తామని డీఈఓ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్నత పాఠశాల్లో నెలకొన్న సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించడంతోపాటు స్టడీ మెటీరియల్ అందించడం తదితర అంశాలపై దృష్టి సారిస్తామని డీఈఓ మంగళవారం తెలిపారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో చాలా హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరతను ఎలా పరిష్కరిస్తారు?

డీఈఓ: ఉన్నత పాఠశాలల్లో సుమారు 200 వరకూ సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. దీనిపై కసరత్తు చేస్తున్నాం. మరో వారం రోజుల్లో టీచర్ల కొరత సమస్యను పరిష్కరించి, సకాలంలో విద్యార్థులకు బోధన సాగేలా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: టెన్త్ పరీక్షలకు ఎంత మంది ఇప్పటి వరకూ ఫీజు చెల్లించారు ?

డీఈఓ: జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 32,913 మంది విద్యార్థులు ఫీజు చెల్లించారు. ఫైన్‌తో ఫీజు చెల్లింపునకు ఇంకా గడువు ఉండటంతో...ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: 10వ తరగతి విద్యార్థులకు గతంలో "అనంత సంకల్పం" మెటీరియల్ అందించేవారు. ఈ ఏడాది ఆ ప్రక్రియ ఎక్కడి వరకూ వచ్చింది..?

డీఈఓ: పదో తరగతి విద్యార్థులకు అందించే మెటీరియల్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) కార్యదర్శి, ఇతర సభ్యులతో త్వరలోనే చర్చిస్తాం. మెటీరియల్ ముద్రణ, ఇతర అంశాలపై ఒక నిర్ణయం తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: అపార్ ఐడీ జనరేషన్ జిల్లాలో ఎంత వరకూ వచ్చింది...?

డీఈఓ: జిల్లాలో అపార్ ఐడీల జనరేషన్ పారదర్శకంగా, కచ్చితత్వంతో చేసే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చాలా వరకూ పూర్తి చేశాం. కేవలం 90 వేల వరకూ పెండింగ్ ఉండే అవకాశం ఉంది. సాంకేతిక సమస్యలను అధిగమించి పెండింగ్ కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: సమగ్రశిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల ఖాళీలు ఎప్పుడు భర్తీ చేసే అవకాశం ఉంది..?

డీఈఓ: ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ ఫైల్‌ను ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్, ఎస్పీడీకి కూడా తెలియజేశాం. సుమారు 10 రోజుల కిందటే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కమిషనర్, ఎస్పీడీ నుంచి ఆదేశాలు రాగానే ఆ పోస్టుల భర్తీ చేస్తాం.

రీ సర్వేతో కొత్త కష్టాలు

రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ
పరిష్కరించలేకపోతున్న అధికారులు
గత ప్రభుత్వ వైఫల్యం వల్లే సమస్యలు

డీ.హీరేహాళ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అవగాహనారాహిత్యంతో చేసిన భూ రీసర్వేతో రైతులకు కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 13 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఈ రీసర్వే జరిగిన ప్రతి గ్రామంలో రికార్డులు తప్పుల తడకగా నమోదు చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రీసర్వే జరిగే సమయంలో అధికారులు, రైతులకు సమన్వయం లేకపోవడంతో చాలా ఇబ్బందులు తలెత్తాయి. చాలా గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న విషయం కూడా రైతులకు తెలియకుండా ముగించేశారు. రీసర్వే ద్వారా వచ్చిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటే .. సమస్య ఎలా పరిష్కరించాలో తెలియడం లేదని వారు సైతం వాపోతున్నారు.

ఎల్‌పీఎం ఖాతా నంబర్ల గందరగోళం

రీసర్వేకు ముందు ఖాతా, సర్వే నెంబర్ల ద్వారా రికార్డులు నమోదు చేసేవారు. రీసర్వే అనంతరం ఖాతా, ఎల్‌పీఎం నంబర్లు మాత్రమే కేటాయించారు. ఇక్కడే సమస్య ఉత్పన్నమైంది. ఒక కుటుంబంలో ఒకరు అంతకన్నా ఎక్కువ మంది పేరున భూమి ఉంటే వారికి సంబంధించిన యాజమాన్య రికార్డుల ప్రకారం ఒక్కొక్కరికి ఒక్కొక్క ఖాతా, ఒక ఎల్‌పీఎం కేటాయించాలి. అలా కాకుండా మొత్తం అందరికీ కలిపి ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. దీంతో ఆ రైతులు తమ భూములను అమ్ముకోవడానికి లేదా వేరొకరి పేరు మీదకు బదలాయించేందుకు వీలు లేకుండా పోయింది. వేరొకరి పేరు మీద భూ యాజమాన్య హక్కు మార్చాలంటే కచ్చితంగా ప్రతి ఒక్కరికి ఒక ఎల్‌పీఎం ఉండాల్సిందే. కొంతమంది భూములు కొనుక్కున్న రైతులు రిజిస్ట్రేషన్ దస్తావేజుల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకం పొందినా ప్రస్తుతం రీసర్వే జరిగిన గ్రామాలలో ఆన్‌లైన్‌లో గతంలో అమ్మిన వారి పేర్లే కనిపిస్తున్నాయి. దీంతో భూమికొన్న రైతులు లబోదిబోమంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తే రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆన్‌లైన్ పని చేయడం లేదు. ఈక్రమంలో మార్పులు, చేర్పులకు అవకాశం కుదరడం లేదు. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులకు కూడా పూర్తి స్పష్టత లేదు.

కొత్త చిక్కులు వచ్చాయి



చాలా ఏళ్లుగా మా భూ రికార్డులు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. ప్రతి ఏడాది ఏ సమస్యా లేకుండా అడంగల్ వచ్చేది. కానీ గత సంవత్సరం రీసర్వే చేసినప్పటి నుంచే కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. రీసర్వే అనంతరం భూ విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. ఎల్‌పీఎంలు ఖాతాలకు సంబంధించి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటిని మార్చుకోవడం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కూటమి ప్రభుత్వమైనా రీసర్వే ద్వారా ఎదురైన సమస్యలు పరిష్కరించాలి.

\- నాగరాజు, డి హీరేహాళ్

పాత రెవెన్యూ రికార్డులే నయం



గత ప్రభుత్వం చెప్పిన విధంగా రీసర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అనుకున్నాం. రీసర్వే జరిగిన తర్వాతే అసలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎల్‌పీఎం నంబర్ ఏమిటో అర్థం కావడం లేదు. గతంలో ఉన్న రెవెన్యూ రికార్డులే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఏమైనా సమస్య వస్తే అధికారులు సులభంగా సమస్యను పరిష్కరించే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడలా లేదు. రీసర్వే ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి పాత రెవెన్యూ రికార్డులనే కొనసాగించాలి.

\- నరసింహ, హిర్దేహాళ్

మార్పులు, చేర్పులకు వీలు పడటం లేదు



భూ రీసర్వే అనంతరం చాలా గ్రామాలలో భూ విస్తీర్ణంలో తేడాలు, ఎల్పీఎం నంబర్ల సమస్య ఉత్పన్నమయ్యాయి. వాటిని సరిదిద్దడం కోసం ప్రయత్నిస్తుంటే ఆన్‌లైన్‌లో వీలుకావడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాం. ప్రస్తుతం రీసర్వే ప్రక్రియ కూడా పూర్తిగా నిలిపివేశాం. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేసి చూస్తున్నాం.

\- అనిల్‌కుమార్, తహసీల్దార్

అంతా సీక్రెట్..!

గుట్టుగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్
పోస్టు భర్తీకి రేపు కంప్యూటర్ పరీక్షలు

అనంతపురం విద్య, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న స్టోర్ కీపర్ కం అకౌంటెంట్ పోస్టు భర్తీపై గోప్యత పాటిస్తున్నారు. బాలసదన్‌లో ఖాళీగా ఉన్న ఒక కాంట్రాక్టు పోస్టుకు ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. 47 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అభ్యర్థులకు ఎప్పుడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారో తెలియడం లేదు. దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మందికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా గతంలో ఉన్న ఉన్నతాధికారులు గోప్యంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిసింది. ఆఖరికి 18 మందిని ఎంపిక చేసి వారికి ఈ నెల 19న కంప్యూటర్ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలోని ఎల్లోరా బాయ్స్ హాస్టల్ పక్కన ఉన్న సెంట్రల్ కంప్యూటర్ సెంటర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అభ్యర్థులకు కంప్యూటర్ నైపుణ్య పరీక్షలు నిర్వహించే ఏర్పాట్లు చేశారు. దీనిపై పలువురు అభ్యర్థులు అనుమానం, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీమియం లిక్కర్ స్టోర్ మంజూరు

31లోగా దరఖాస్తు చేసుకోవాలి: ఈఎస్

అనంతపురం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేశారన్నారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలన్నారు. రెండో ఏడాది దానిపై 10 శాతం పెంచుతామన్నారు. ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం కనీసం 4000 చదరపు అడుగులు వైశాల్యం ఉండాలన్నారు. ఈ స్టోర్‌లో ఐఎంఎఫ్‌ఎల్ కనీస ధర రూ.1200, బీర్ ధర రూ.400పైన ఉన్న స్టాక్ విక్రయాలు మాత్రమే జరుగుతాయన్నారు. స్టోర్‌లో మద్యపానం అనుమతించబడదన్నారు. మద్యం, సిగార్లు, సిగరెట్లు, మద్యానికి సంబంధించిన ఉపకరణాలు, శీతల పానీయాలను విక్రయించవచ్చునన్నారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తును https//apsbcl.ap.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు నాన్ రిఫండబుల్ అన్నారు. ఈ డబ్బును డీడీ ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 31 సాయంత్రం 5 గంటల్లోగా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు పంపుతామని, రాష్ట్ర ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ముందుకు వెళతామని తెలిపారు.

అంజన్న హుండీల ఆదాయం రూ.62.62 లక్షలు

గుంతకల్లు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ. 62.62 లక్షల ఆదాయం లభించింది. ఆలయంలోని హుండీలను మంగళవారం ఉదయం తెరచి సొమ్మును లెక్కించారు. సాయంత్రం వరకూ డబ్బును లెక్కగట్టగా ప్రధాన హుండీల ద్వారా రూ. 62,36,139లు, అన్నదానం హుండీ ద్వారా రూ. 26,206లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏడు గ్రాముల ఒక మిల్లీ గ్రాము బంగారం, 1. 630 కిలోల వెండి వస్తువులు వచ్చినట్లు ఈఓ వాణి తెలిపారు. అలాగే 120 కెనడా డాలర్లు, 205 నేపాల్ రూపాయలు, 10 సౌదీ అరేబియా రియాళ్లు లభ్యమైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, అనంతపురం డివిజనల్ దేవదాయశాఖ తనిఖీ అధికారి వన్నూరు స్వామి, ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటు వెంకటేశులు, అర్చకులు, సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.



హుండీల సొమ్మును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, వలంటీర్లు

తస్మాత్ జాగ్రత్త

మాతాశిశుమరణాలు జరిగితే చర్యలు తప్పవు
డీఎంహెచ్ఓ హెచ్చరిక

అనంతపురం టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు జరిగితే చర్యలు తప్పవని డాక్టర్లు, సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి హెచ్చరించారు. జిల్లావైద్యశాఖ కార్యాలయంలో నవంబరు నెలలో జరిగిన మాతాశిశుమరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాతృ మరణాలు 5, శిశుమరణాలు 5 ఎందుకు జరిగాయని ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఇపుడు కారణాలు చెప్పడంకాదు, మళ్లీ మీవద్ద ఇలాంటివి సంభవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాతాశిశుమరణాలు పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలు తీసుకొచ్చిందన్నారు. అలాంటపుడు ఇంకా మరణాలు జరుగుతుండటం దురదృష్టకరమన్నారు. గర్భిణులను గుర్తించిన తర్వాత నుంచి వారికి అవసరమైన వైద్యసేవలు అందించడంతో పాటు, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ప్రతినెలా పరీక్షించి అనారోగ్యంతో ఉంటున్నవారిని, రక్తహీనతతో బాధపడుతున్నవారిని గుర్తించి హైరిస్క్ కేసులుగా పరిగణించి, ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రసవ సమయంలోను ముందుగానే ఆస్పత్రులకు పంపించాలన్నారు. నెలలు నిండకుండానే పుట్టిన శిశువులును వెంటనే ఎన్ఆర్‌సీలో చేర్పించి అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మరణాలు జరగకుండా చూడాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టరు యుగంధర్, అనస్తీషియా డాక్టరు నవీన్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు శంకరనారాయణ, డాక్టర్లు పార్వతి, శ్రీనివాసులు, డీవీరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాతాశిశుమరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

డాక్టర్లకు ఐదుగుణాలే ఆభరణాలు

ఇస్కాన్ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సత్యగోపీనాథ్ దాస్

అనంతపురం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్లకు స్వచ్ఛమైన తెల్లటి దుస్తులు, చెరగని చిరునవ్వు, నిబ్బరం, అంకితభావం, విసుగులేకుండా సేవలు అందించడమనే ఈ ఐదు గుణాలే ఆభరణాలు అని ఇస్కాన్ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సత్యగోపీనాథ్‌దాస్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ కోరిక మేరకు మంగళవారం వైద్య కళాశాలలో డాక్టర్లు, నర్సులకు ఆచరణాత్మక కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సత్యగోపీనాథ్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని చూసినప్పుడే రోగులకు సగం రోగం తగ్గిపోతుందన్నారు. సామాజిక సంబంధాలు, మానవతా విలువలు మధ్య సమన్వయం పాటిస్తూ వృత్తి ధర్మాన్ని నిర్వహించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారిసహాయకుల పట్ల ప్రేమగా మెలగాలని, డిశ్చార్జ్ అయ్యే వరకు ఎక్కడా ఏ లోటు రాకుండా చూసుకోవాలన్నారు. అపుడే మనపై మరింత గౌరవం పెరగడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ డాక్టర్లు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సత్యనాథ్ గోపీదాస్‌ను సత్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టరు



ఈవీఎంల పరిశీలన అనంతరం గోడౌన్‌కు సీల్ వేయిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు, రాజకీయపార్టీలతో కలిసి పాత ఆర్డీఓ ఆఫీస్ ఆవరణలోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అక్కడ ఈవీఎంలు భద్రంగా ఉన్నాయా? ఎలాంటి భద్రతా చర్యలు తీసుకుంటున్నారనే అంశాలను పరిశీలించారు. అనంతరం అందరి సమక్షంలోనే ఆ ఈవీఎంల గోడౌన్‌కు సీల్ వేయించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, తహసీల్దార్ హరికుమార్, కలెక్టరేట్ సెక్షన్ ఆఫీసర్లు యుగేశ్వరి, కనకరాజు, దివాకరరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్నీ ఏకగ్రీవమే

సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక



జీబీసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా ఎన్నికైన మారయ్య


అనంతపురం క్లాక్‌టవర్/విడపనకల్లు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ పరిధిలోని సాగునీటి సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. హెచ్ఎల్ఎంసీ అధ్యక్షుడిగా కొండాపురం కేశవరెడ్డి, ఉపాధ్యక్షులుగా గిరప్పగారి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. మిడ్‌పెన్నార్ సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కొర్రపాటి శేఖర్, ఉపాధ్యక్షుడిగా కుమ్మెత చంద్రాయుడు ఎన్నికయ్యారు. మిడ్‌పెన్నార్ నార్త్‌కెనాల్ అధ్యక్షుడిగా రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మీనుగ వెంకటేష్ ఎన్నికయ్యారు. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ ప్రెసిడెంట్‌గా కుమ్మెత ప్రమీళమ్మ, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడుగా మారయ్య, ఉపాధ్యక్షులుగా అప్పా రామకృష్ణ, ఆలూరు బ్రాంచ్ కెనాల్ నగరడోన కిష్టప్ప, ఉపాధ్యక్షులుగా మీసాల రామాంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్చెల్సీ పరిధిలోని ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అధికారపార్టీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలోనే ఎన్నికలు నిర్వహించినట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు.

అర్హులందరికీ డ్రిప్ పరికరాలు

- ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరు చేయాలని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గుంటూరు నుంచి మంగళవారం ఆయన అన్ని జిల్లాల ఏపీఎంఐపీ పీడీ, ఏపీడీ, డ్రిప్ కంపెనీల రాష్ట్ర కోఆర్డినేటర్లు, జిల్లా కో ఆర్డినేటర్లలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 42459 మంది రైతులు 58475 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి దాకా 17850 మంది రైతులకు సంబంధించి 21809 హెక్టార్లల్లో ప్రాథమిక సర్వే పూర్తయిందన్నారు. వీరిలో 6568 మంది రైతులు 7731 హెక్టార్లకు రైతు వాటా డబ్బులు డిజిటల్ పద్ధతిలో చెల్లించారన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్ 5794 మంది రైతులకు 6818 హెక్టార్లకు పరిపాలన ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇందులో ఇప్పటి దాకా 3611 మంది రైతులకు 4245 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేసినట్లు వివరించారు. మిగిలిన రైతులకు త్వరగా డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేయడంతోపాటు పొలాల్లో బిగించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



ఎస్ఎస్‌బీఎన్, పీవీకేకే జట్ల మధ్య మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్‌కళాశాల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఎస్కేయూ అంతర్‌కళాశాలల క్రికెట్ పోటీలు రెండో రోజు మంగళవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో కొనసాగాయి. పీవీకేకే కళాశాలపై ఎస్ఎస్‌బీఎన్ జట్టు గెలుపొందింది. కదిరి ఎస్‌టీఎస్ఎన్ కళాశాలపై తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. గుంతకల్లు ప్రభుత్వ ఎస్కేపీ కళాశాల జట్టుపై అనంతపురం వివేకానంద కళాశాల, కళ్యాణదుర్గం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌పై గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజ్, పెనుకొండ పరిటాల డిగ్రీ కళాశాల జట్టుపై కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల జట్టు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై అనంతపురం ఆర్ట్స్ కాలేజ్ జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ పిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులునాయక్, పీడీలు శ్రీరామ్, జయరాం, ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడాపోటీలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు బుధవారం నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్(ఐపీఎస్‌జీఎం-2024)ను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ పోటీలను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారి అవసరాల కోసం 9912342020, 7901620020 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మాధవపెద్ది సత్యం (వర్ధంతి)



ప్రముఖ రంగస్థల, సినీ నటుడు, నేపథ్య గాయకుడు మాధవపెద్ది సత్యం 1922 మే 11న బాపట్లలో జన్మించారు. విలక్షణమైన ఆయన స్వరం సంగీత ప్రియులను బాగా ఆకట్టుకునేది. ప్రముఖ నటుడు ఎస్వీ రంగారావుకు, హాస్యనటుడు రేలంగి, రమణా రెడ్డిలకు ఆయన స్వరం సరిగ్గా సరిపోయేది. బాల్యం నుంచి నాటకాలలో నటించిన ఆయన వెండితెరపై కూడా నటించారు. 'షావుకారు' సినిమాతో తెలుగు సినీరంగంలో అడుగుపెట్టారు. 'మాయాబజార్' లో వివాహ భోజనంబు వింతైన వంటకంబు, 'కుల గోత్రాలు' లో అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. 75ఏళ్ల వయస్సులో సింధూరం సినిమాలో 'సంకురాతిరి పండగొచ్చెరో...' పాట పాడి ప్రశంసలందుకున్నారు. దాదాపు అన్ని భారతీయ భాషలలో 7 వేలకుపైగా పాటలు పాడారు. 2000 డిసెంబరు 18న కన్నుమూశారు.

రఘు రాయ్ (పుట్టినరోజు)



ప్రముఖ ఫోటో జర్నలిస్టు, 'పద్మశ్రీ' గ్రహీత రఘునాథ రాయ్‌చౌదరి 1942 డిసెంబరు 18న పంజాబ్‌లోని ఝంగ్ ప్రాంతంలో జన్మించారు. (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది). ఫోటో జర్నలిజంపై ఆయన 18 పుస్తకాలను వెలువరించారు. ఢిల్లీలో స్టేట్‌మెన్ పత్రికకు ఫోటోగ్రాఫర్‌గా, 'ఇండియా టుడే'కు డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా వ్యవహరించారు. 1984లో భోపాల్ గ్యాస్ దుర్ఘటనపై ఆయన వెలువరించిన ప్రత్యేక డాక్యుమెంటరీ అంతర్జాతీయంగా ఆకర్షించింది. యునెస్కో అంతర్జాతీయ ఫోటోల పోటీకి న్యాయనిర్ణేతగాను, వరల్డ్ ప్రెస్ ఫోటోకు మూడుసార్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

బ్రాడ్ పిట్ (పుట్టినరోజు)



ప్రముఖ అమెరికన్ నటుడు, నిర్మాత విలియం బ్రాడ్లీ పిట్ 1963 డిసెంబరు 18న జన్మించారు. బ్రాడ్ పిట్‌గా పేరొందారు. హాలీవుడ్ వినోద రంగాన్ని అత్యంత ప్రభావం చేసినవారిలో విలియం ఒకరు. ప్రపంచపు అత్యంత ఆకర్షణీయమైన పురుషుల్లో ఒకడిగా ఆయన ఖ్యాతి గడించారు. రెండుసార్లు గోల్డెన్‌గ్లోబ్ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రైమ్‌టైమ్ ఎమ్మీ పురస్కారంతో పాటు లెక్కకు మిక్కిలి పురస్కారాలను ఆయన పొందారు. ఎయిడ్స్‌పై పోరాటం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ఆయన బాసటగా నిలబడ్డారు.

'దిల్' రాజు (పుట్టిన రోజు)



మొదటిసినిమా 'దిల్'తో పేరొందిన ప్రముఖ తెలుగు సినీ నిర్మాత, పంపిణీదారుడు 'దిల్' రాజు 1970 డిసెంబరు 18న నిజామాబాద్ జిల్లా నరసింగపల్లిలో జన్మించారు. అసలు పేరు వెలమకుచ వెంకట రమణారెడ్డి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఆయన పలు హిట్ సినిమాలను నిర్మించారు. బొమ్మరిల్లు, ఫిదా, దువ్వాడ జగన్నాథం, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, 'శతమానం భవతి తదితర సినిమాలు హిట్ పొందాయి. ఆయన నిర్మించిన సినిమాలు నంది, ఫిలింఫేర్ పురస్కారాలు అందుకున్నాయి. 2016లో నాగిరెడ్డి చక్రపాణి జాతీయ పురస్కారం అందుకున్నారు.

బర్ఖాదత్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత బర్ఖాదత్ న్యూఢిల్లీలో 1971 డిసెంబరు 18న న్యూఢిల్లీలో జన్మించారు. టీవీ జర్నలిస్టుగా ఆమె మంచి పేరు గడించారు. 21 సంవత్సరాల పాటు ఆయన ఎన్‌డిటివికి జర్నలిస్టుగా సేవలందించారు. 1999లో కార్గిల్‌యుద్ధ సమయంలో అక్కడికి వెళ్లి వార్తలను సేకరించడం ద్వారా జాతీయంగా పేరొందారు. నిర్భీతితో వార్తలను అందించేవారు. హిందూస్థాన్ టైమ్స్, వాషింగ్టన్ పోస్టు వంటి పత్రికలకు కాలమిస్టుగా పనిచేశారు. యూట్యూబ్ న్యూస్ ఛానెల్ మోజోను స్థాపించారు. పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

రెండో విమానాశ్రయ అధ్యయనానికి

ఐడెక్ సంస్థకు బాధ్యతలు

» భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెల్లడి

బెంగళూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు అనుబంధంగా రెండో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించే ప్రస్తావనపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఐడెక్ సంస్థకు అప్పగించినట్టు భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. విధానపరిషత్‌లో జవరాయగౌడ ప్రశ్నకు సమాధానంగా మంత్రి స్పందించారు. విమానాశ్రయ ఏర్పాటుకు విస్తారమైన భూమి ఉండాలని రోడ్డు, రైలు, మెట్రో వంటి సదుపాయాలు ఉండాలని అన్నింటినీ పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్ట్‌కు రద్దీ పెరగడంతోపాటు మరో పదేళ్లకు ఒప్పందం గడువు ముగుస్తున్నందున చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చెరకు బకాయిల చెల్లింపులకు చర్యలు

చెరుకు బకాయిలు సకాలంలో ఫ్యాక్టరీలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి శివానంద పాటిల్ తెలిపారు. పరిషత్‌లో సభ్యుడు రవికుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా 3 ఫ్యాక్టరీల నుంచి 3.94 కోట్ల రూపాయల బకాయి ఉందని, వాటిని త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రంలోని అన్ని పట్టణాలలోనూ ఈ-ఆస్తి

బెంగళూరు పాలికె పరిధిలో అన్ని ఆస్తులకు ఇ-ఖాతా ప్రక్రియ అమలు చేసినట్టే రాష్ట్రంలోని అన్ని నగర, పట్టణ పంచాయతీ, స్థానిక సంస్థలలో అమలు చేస్తామని పరిపాలనా వ్యవహారాలశాఖ మంత్రి రహీంఖాన్ తెలిపారు. పరిషత్‌లో చిదానంద గౌడ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

బాలింతల మృతి దర్యాప్తును సిట్‌కు అప్పగించండి - ప్రతిపక్షాల డిమాండ్

రాష్ట్రంలో ఇటీవల బాలింతల మృతి తీవ్రమవుతోందని ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని ప్రతిపక్ష పార్టీ సభ్యులు ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. బళ్ళారిలో ఐదుమంది బాలింతలు మృతి చెందారని, బెళగావితోపాటు పలు ఆసుపత్రులలో బాలింతలు, నవజాత శిశు మరణాల అంశాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. కొన్ని ఫార్మా కంపెనీలు మనదేశానికి ఒక రకంగాను, విదేశాలకు మరో రకంగాను మందులు తయారు చేస్తున్నాయని ఆరోపించారు. రింగర్ ల్యాక్టేట్ ద్రావణం (సెలైన్) వాడకంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. సిజేరియన్ జరిగాక బాలింతలు బాగున్నారని, ఆ తర్వాత సెలైన్ ఇచ్చాకనే మార్పు వస్తోందని సభ్యులు రవికుమార్, శరవణ తదితరులు అభిప్రాయపడ్డారు.

కేఐఏడీబీ స్థలాల కేటాయింపులో అక్రమాలు లేవు

కేఐఏడీబీలో సీఏ నివాస స్థలంలో అక్రమాలు జరగలేదని మంత్రి తెలిపారు. బీజేపీ సభ్యుడు సీటీ రవి ప్రశ్నకు మంత్రి ఎంబీ పాటిల్ సమాధానమిచ్చారు. కర్ణాటక జీఎస్టీ సవరణ బిల్లు, విశ్వవిద్యాలయాల సవరణ బిల్లులను పరిషత్‌లో ఆమోదించారు.

తళెవాడి అటవీప్రాంతంలో మంత్రి సందర్శన



తులసిగౌడ స్మారక ఉద్యానవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

బెంగళూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా ఖానాపుర భీమగడ అటవీప్రాంతంలోని తళెవాడి గ్రామ పరిధిలో నివసించేవారితో అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె భేటీ అయ్యారు. సోమవారం రాత్రి పల్లెకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ప్రోత్సాహం ఇస్తామని, అటవీ ప్రాంతాన్ని వీడాలని సూచించారు. భీమగడ అటవీప్రాంతంలో 13 జనావాసాలలో 754 కుటుంబాలు ఉన్నాయని వారందరికీ ఇల్లు తదితర సౌలభ్యాలు కల్పిస్తామన్నారు.

తులసిగౌడ ఉద్యానవనం ప్రారంభం

బెళగావి జిల్లా హిండగల జలాశయం సమీపాన దివంగత ఉమేశ్ విశ్వనాథకత్తి చిట్టి ఉద్యానవనం, పర్యావరణ ప్రేమి పద్మశ్రీ తులసిగౌడల పేరిట ఉద్యానవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వేడి పెరుగుతున్న తరుణంలో వాతావరణ మార్పులు, దుష్పరిణామాలను తగ్గించేలా పిల్లల్లో పర్యావరణ, మొక్కల సంరక్షణపై జాగృతి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డ్యామ్ వద్ద సుమారు 500 ఎకరాలలో వివిధ ఉద్యానవనాలు నిర్మించనున్నట్టు తెలిపారు. ఇక్కడ మొసళ్ళ పార్కు, వెదురుఉద్యానవనం, పక్షిధామ నిర్మించే పథకం ఉందని ఇందుకు ప్రామాణికంగా కృషి చేస్తామన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

బెంగళూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డిప్లమో విద్యార్థులు నైపుణ్యతను పెంచుకుని పరిశ్రమలకు అవసరమైన రీతిలో ఎదగాలని పీఈఎస్ యూనివర్సిటీ ప్రొ చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. బజాజ్ ఆటో లిమిటెడ్ సంస్థ సహకారంతో పీఈఎస్‌లో డిప్లమో ట్రెయినీ ఇంజనీర్ (డిటిఇ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది పరిశ్రమల ప్రగతికి దోహదపడుతుందని జవహర్ అభిప్రాయపడ్డారు. బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) డిటిఇ ద్వారా 65మంది విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టుగా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనింగ్ ముగిసిందని, ప్రస్తుతం డిప్లమో విద్యార్థులకు శిక్షణ ప్రారంభించామన్నారు. బజాజ్ ఆటో లిమిటెడ్ సీఎస్ఆర్ వైస్‌ప్రెసిడెంట్ సుధాకర్ మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ఇంజనీరింగ్, డిప్లమో చదివేవారికి ఆధునాతనమైన నైపుణ్యత కల్పించదలిచామన్నారు. తద్వారా బజాజ్ కంపెనీతోపాటు ఇతరత్రా సంస్థలలో సులభతరంగా ఉద్యోగాలు పొందగలుగుతారన్నారు. సంసెరా ఇంజనీరింగ్ ఫౌండర్ డైరెక్టర్ ఎఫ్ఆర్ సింఘ్వి, వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీధర్, ప్రొఫెసర్ నాగార్జున సాదినేని తదితరులు పాల్గొన్నారు.



డీటీఈ ప్రారంభంలో పీఈఎస్ ప్రొ-చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి తదితరులు

కన్నడకు ప్రాధాన్యం ఇవ్వాలి: కరవే

బాగేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలలో కన్నడ పాటలు, నృత్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని లేనిపక్షంలో తీవ్ర పోరాటం చేస్తామని కర్ణాటక రక్షణా వేదిక (కరవే) తాలూకా అధ్యక్షుడు కేఎన్ హరీశ్ హెచ్చరించారు. పట్టణంలో బీఈఓ వెంకటేశప్పకు మంగళవారం వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మైసూరు రాష్ట్రం కర్ణా టకగా మరునామకరణం చేసి 50ఏళ్లు గడిచిందన్నారు. కన్నడ గొప్పదనాన్ని చాటేలా రాష్ట్ర ప్రభుత్వం భువనేశ్వరి దేవి రథాన్ని రాష్ట్రవ్యాప్తంగా పర్యటించేలా చేసి సామాన్యులకు సైతం దగ్గరకు చేస్తోందన్నారు. ఇలాంటి తరుణంలో కన్నడ భాషకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. చాలా పాఠశాలల వార్షికోత్సవాల్లో కన్నడ పాటలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మన భాషా సంస్కృతులను మనమే నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఈ ధోరణి మారాలని సుతి మెత్తగా హెచ్చరించారు. ఈ సందర్భంగా కరవే జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజా తమ్మ, కరవే తాలూకా ప్రధాన కార్యదర్శి రియాజ్, జిల్లా కార్యదర్శి మంజునాథ్, ఆటో విభాగం అధ్యక్షుడు జబివుల్లా, తదితరులు పాల్గొన్నారు.



బీఈఓ వెంకటేశప్పకు వినతిపత్రం అందజేస్తున్న కరవే పదాధికారులు

ప్రమాద మృతులకు కేఆర్ఎస్ శ్రద్ధాంజలి

చింతామణి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్) కార్యాధ్యక్షుడు ఎస్‌హెచ్ లింగేగౌడ, మంగళూరుకు చెందిన కుంజి మూసాలు గుజరాత్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందడంపై పట్టణంలోని బెంగళూరు సర్కిల్‌లో వారి చిత్రపటాలకు మంగళవారం పూలు చల్లి శ్రద్ధాంజలి ఘటించారు. కేఆర్ఎస్ తాలూకా అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతూ పార్టీ ఆరంభం నుంచి బలోపేతానికి లింగేగౌడ కృషి చేశారన్నారు. గత ఆరేళ్లుగా పార్టీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించి ఇటీవలే కార్యాధ్యక్షుడిగా నియమితులైన లింగేగౌడ మృతి ఎంతో బాధ కలిగించిందన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని వాపోయారు. అత్యాచార ఆరోపణల కేసుల్లో దర్యాప్తు వేగిరం కావాలని, నిందితులకు కఠినశిక్ష పడాలని కోరుతూ రాష్ట్రపతి, ప్రధానమంత్రిని భేటీ అయి విన్నవించాలని మంగళూరు నుంచి ఢిల్లీకి ఐదుగురు కేఆర్ఎస్ బృందం పాదయాత్రగా బయల్దేరిందన్నారు. 55వరోజు గుజరాత్ రాష్ట్రం భరూజ్ నగరానికి చేరుకోగా పాదయాత్రలోనివారికి నైతిక మద్దతుగా కేఆర్ఎస్ కార్యాధ్యక్షుడు లింగేగౌడ కూడా పాల్గొన్నారన్నారు. అయితే భరూజ్ సమీపాన లారీ ఒకటి పాదచారులపై దూసుకెళ్లిన ప్రమాదంలో లింగేగౌడ, మంగళూరుకు చెందిన కుంజి మూసా మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మహిళ సహా నలుగురు గాయపడ్డారని వారంతా భరూజ్ ఆసుపత్రిలో చికిత్స పొంది తమ పాదయాత్రను ఢిల్లీకి కొనసాగించారన్నారు. శ్రద్ధాంజలి సభలో కేఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, తాలూకా ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, తాలూకా కార్యదర్శి విశ్వనాథ్, సంఘటనా కార్యదర్శి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న కేఆర్ఎస్ తాలూకా పదాధికారులు

4జీ నెట్‌వర్క్‌లో రాష్ట్రం ముందంజ

బెంగళూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఓపెన్‌సిగ్నల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో 4జీ నెట్‌వర్క్‌లో కర్ణాటక ముందంజలో ఉందని విఐ దక్షిణభారత క్లస్టర్ హెడ్ ఆనంద్‌దాని అభిప్రాయపడ్డారు. మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ 4జి డౌన్‌లోడ్ వేగవంతం, అప్‌లోడ్, వీడియో అనుభూతి, గేమ్స్, వాయిస్ అప్లికేషన్‌తోపాటు ఆరు విభాగాలలో రాష్ట్రంలో ఉత్తమ నెట్‌వర్క్ సాగినట్టు తెలిపారు. బ్యాండ్‌విడ్త్ అప్‌గ్రేడ్ ఎల్ 900 నుంచి 8000కుపైగా ప్రదేశాలలో కొత్త సైట్‌లలో నెట్‌వర్క్ టవర్‌లు పెరిగాయన్నారు. డిజిటల్ అనుభవంలో నిబద్ధత ఉందన్నారు. 30 జిల్లాల్లో 2200కుపైగా సైట్లలోనూ 1500కుపైగా పట్టణ ప్రాంతాలలో నెట్‌వర్క్‌లు ఉన్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు ప్రదేశాలలో కొత్త టవర్‌లు ఏర్పాటు చేయదలిచామన్నారు.

దేవరమళ్ళూరులో గ్రామదేవత రథోత్సవం



రథోత్సవంలో భక్తుల సందడి

శిడ్లఘట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకా లోని దేవర మళ్ళూరులో గ్రామదేవత మళ్ళూరాంబదేవి బ్రహ్మ రథోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయంలో మూల విరాట్టుకు విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తిని అలంకరించిన రథంపై కొలువుదీర్చగా ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, ఉప తహసీల్దారు పూర్ణిమాలు ఉత్సవాన్ని ప్రారంభించారు. వీరగాసె, డొళ్ళుకుణిత, వాద్యకళాబృందాలు ఊరేగింపునకు మెరుగు తెచ్చాయి. జాతరలో బొరుగులు, బత్తాసు, జిలేబి దుకాణాలు, పలు రకాల ఆటల బొమ్మలు వెలిశాయి. వేలాదిమంది భక్తులకు అన్నదాసోహం నిర్వహించారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాలప్రజలు తరలివచ్చారు. జాతరకు బీజేపీ ప్రముఖుడు సీకల్ ఆనందగౌడ, సీపీఐ శ్రీనివాస్, ఆలయ సమితి అధ్యక్షుడు మునిరాజుగౌడ, సుబ్రమణ్యప్ప, వేణుగోపాల్, దేవరమళ్ళూరు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సుశీలమ్మ, మునిస్వామి, గ్రామపంచాయతీ సభ్యులు వెంకటేశ్ చక్రవర్తి, రెడ్డిస్వామి, బంకు మునియప్ప, తాదూరు రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి



సరికొత్త బొమ్మలతో అలంకరణ ఇలా..

బెంగళూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. ఇప్పటికే బ్రిగేడ్, ఎంజీ రోడ్లతోపాటు వివిధ ప్రాంతాలలో క్రిస్మస్‌కు అవసరమైన దుకా ణాలు వెలిశాయి. మరో వారం రోజుల్లో పండుగ వస్తుండడం, క్రిస్మస్‌కు ముందు ఇదే చివరి ఆది వారం కావడంతో మాల్స్‌లోనూ కొత్త శోభ కనిపిస్తోంది. ఓరియన్ మాల్‌లో 45 అడుగుల క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజా తోపాటు ప్రత్యేకమైన అలంకరణలు ఏర్పాటు చేసినట్టు బ్రిగేడ్ గ్రూప్ రిటైల్ వైస్ చైర్మన్ సునీల్ మున్షి తెలిపారు.

రాయదుర్గం-బళ్లారి మీదుగా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రయాగ రాజ్ కుంభమేళాను పురస్కరించుకుని జిల్లాలోని రాయదుర్గం, కర్ణాటకలోని బళ్లారి మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. మైసూరు-దానాపూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (నం. 06207) రైలు జనవరి 18, ఫిబ్రవరి 15, మార్చి 1న (శనివారాలలో) మైసూరులో సాయంత్రం నాలుగున్నరకు బయలుదేరి మూడు రోజుల తర్వాత మంగళవారం ఉదయం 10 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06208) జనవరి 22, ఫిబ్రవరి 19, మార్చి 5న (బుధవారాలలో) దానాపూర్‌లో తెల్లవారుజామున 1-45 గంటలకు బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మైసూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు మాండ్య, మద్దూరు, కెంగెరి, కేఎస్ఆర్ బెంగళూరు, యశ్వంతపూర్, టుముకూరు, అరిసికెరె, చిక్జాజుజుర్, చిత్రదుర్గ, రాయదుర్గ, బళ్లారి కంటోన్మెంటు, హోస్పేట, కొప్పల్, గదగ్, హుబ్లి, బాదామి, బాగల్‌కోట్, విజయపుర, షోలాపూర్, కురుద్వాడి, డౌండ్, అహ్మదానగర్, కోపర్‌గావ్, మన్మాడ్, భుస్వాల్, ఖండ్వా, తల్వాడ్యా చనేర, ఖిర్కియా, హర్దా, బాణాపుర, ఇటార్సి, పిప్రియ, నరసింగ్‌పూర్, జబల్‌పూర్, కట్ని, మైహర్, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, చునర్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, ఆర స్టేషన్ల మీదుగా వెళ్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, డిసెంబరు 17(ఆం ధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7 పలికినట్లు తెలిపారు.

శబరిమలలో రామనగర జిల్లా భక్తుడి మృతి

బెంగళూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం శబరిమల అయ్యప్ప ఆలయం సమీపాన మల్లికాపుర వద్ద ఒక భక్తుడు స్కైవాక్‌పై నుంచి దూకడంతో మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం రామనగర జిల్లా కనపురకు చెందిన కుమార్ (40)గా గుర్తించారు. కుమార్ సుమారు 20అడుగుల ఎత్తైన స్కైవాక్ నుంచి దూకడంతో కాలి, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత అతడిని సన్నిధానం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించిన అనంతరం పంపాలోని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కొట్టాయం మెడికల్ కళాశాలకు మార్పు చేశారు. ఈ సందర్భంగా హార్ట్ అటాక్ వచ్చి మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఇతడి మానసిక పరిస్థితి గురించి మరింత తెలియాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

పెట్రోల్ బంకును ప్రారంభించిన నటి రమ్య

బాగేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాగేపల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద నూతనంగా నిర్మించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ పెట్రోల్‌బంకును మాజీ ఎంపీ, సినీ నటి రమ్యా లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, డీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వీ వెంకటశివారెడ్డి, జడ్పీ మాజీ సభ్యుడు హరినాథరెడ్డి, ఒక్కలిగల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి కోనప్పరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల ఆధ్వర్యంలో కేంద్రమంత్రి పుట్టినరోజు వేడుకలు



విద్యార్థులకు బెడ్‌షీట్‌లు పంపిణీ

శిడ్లఘట్ట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే రవికుమార్ అభిమానులు అర్థవంతంగా సామాజిక సేవలందించారు. తాలూకాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఆశాకిరణ అంధ విద్యార్థుల పాఠశాలలో కేక్ కట్ చేసిన అనంతరం బెడ్‌షీట్‌లు అందచేశారు. నగరసభ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ కుమారస్వామి ముఖ్యమంత్రిగా రైతులకు ఎన్నో సంక్షేమాలు అమలు చేశారన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారన్నారు. కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలకు ఆయన సేవలు అపారమన్నారు. విజ్డమ్ నాగరాజ్, చిత్ర మనోహర్, జేడీఎస్ నాయకుడు శంకర్ మాట్లాడారు. నగరసభ ఉపాధ్యక్షుడు రూప నవీన్, సభ్యులు లక్ష్మణ్, సురేశ్, ఆసిఫ్, నిజాం, కాంట్రాక్టర్ మంజునాథ్, పెద్దసంఖ్యలో జేడీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

16 మందితో అత్యవసర చికిత్స బృందం

బెంగళూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవయవమార్పిడి శస్త్రచికిత్సలలో పేరొందిన బిజిఎస్ ఆసుపత్రి 16మంది విభిన్నరంగాల వైద్యనిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మంగళవారం ఆసుపత్రి క్లస్టర్ సీఓఓ జితేంద్ర అరోరా మీడియాకు తెలిపారు. అవయవదానంకు అత్యవసరంగా వైద్యులను సమకూర్చుకునేవారమన్నారు. బ్రెయిన్‌డెడ్ వంటి కేసులు వచ్చినప్పుడు భిన్నమైన అవయవాలు అవసరమైనవారికి ఏకకాలంలో ఆపరేషన్‌లు చేయాలంటే తగిన నిపుణులు అందుబాటులో ఉండాలని 16మంది తో మల్టి డిసిప్లినరీ పాలి ట్రామా బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, అనస్థీషియా, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరో సర్జన్, జనరల్ సర్జన్, బ్లడ్‌బ్యాంక్, ల్యాబ్, ఐసీయూ, న్యూరో క్రిటికల్ కేర్ విభాగాల నిపుణులు ఉంటారన్నారు. క్లస్టర్ మెడికల్ డైరెక్టర్ స్మితా తమ్మయ్యతోపాటు బెంగళూరు పశ్చిమవిభాగం ఏసీపీ బసవరాజ్ తేలి, రన్ అడిక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోహన్ దేవేగౌడ, రోటరీ బెంగళూరు అశ్విన్‌కుమార్‌తోపాటు పలువురు ముఖ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

రాయదుర్గం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదుం గ్రామంలో ఈ నెల 10న పొలం గట్టు వివాదంలో గంగాధర మృతికి కారణమైన శివ, వంశీ, సూర్యలను అరెస్టు చేసినట్లు సీఐ జయనాయక్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ చదుం గ్రామానికి చెందిన దొణప్ప, చిన్న గంగప్ప, పెద్ద గంగప్పకు మూడు ఎకరాల పొలం ఉంది. పొలం గట్టు వివాదంలో దొనప్ప కుమారుడు గంగాధర్‌కు చిన్న గంగప్ప కుమారుడు శివ, పెద్ద కుమారుడు వంశీ, సూర్యలతో గొడవ ఉండేది. పొలం వివాదంలో అడ్డొస్తున్నాడని మనసులో పెట్టుకొని పదో తేదీ మధ్యాహ్నం తల్లి రుద్రమ్మతో కలిసి గంగాధర్ పొలంలో పని చేస్తుండగా ముగ్గురు కలిసి కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన గంగాధర్‌ను రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.00	1,590.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,395	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,467	1,916
నీటి నిల్వ (టీఎంసీలు)	90.35	11.43

అంగన్‌వాడీల నిరసన

బళ్లారి సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డీసీ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీకార్యకర్తలు, హెల్పర్లు నిరసన చేపట్టారు. సీఐటీకి అనుబంధంగా ఉన్న కర్ణాటక రాష్ట్ర అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ నాయకులు జే.సత్యబాబు, ఉమాదేవి మాట్లాడుతూ 2018నుంచి కేంద్ర ప్రభుత్వం గ్రాట్యుటీని పెంచలేదని, దీనిని రూ. 26 వేల వరకు పెంచాలన్నారు. 2023 విధానసభ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన గౌరవ వేతనం రూ. 15వేలు తక్షణమే అమలు చేయాలన్నారు. పదవీ విరమణ పొందిన వారికి ఎన్.పీ.ఎ‌స్, రూ.10వేలు నెలవారీ పింఛనుగా ఇవ్వాల న్నారు. అంగన్‌వాడీల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతి ప్రారంభించాలన్నారు. సామూహిక ఆరోగ్య భీమా వెంటనే అమలు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే అనుబంధ పోషకాహారానికి జీఎస్టీ, యూనిట్ ధరను పెంచవద్దని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గతంలో మాదిరిగానే మెనూ ఖరారు విధానాన్ని అమలు చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మూడు నెలల్లో ఖాళీలను భర్తీ చేయాలని, లేదంటే లేకుంటే ఓవర్ టైమ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోమ్ ఇవ్వాలని, హెల్పర్‌ను నియమించుకునే అధికారం హక్కు వర్కర్‌కు ఇవ్వాలన్నారు. అనంతరం వారు ప్రధాన మంత్రికి రాసిన వినతి పత్రాన్ని జిల్లా యంత్రాంగానికి అందించారు. అంతకు ముందు నగరంలోని నారాయణరావు పార్కు నుంచి డీసీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మల్లమ్మ తదితరులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకులు నిరసనలో పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



అరుణ (ఫైల్)

సిరుగుప్ప, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మనస్థాపంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ పరశురామ్ తెలిపిన వివరాల మేరకు సిరుగుప్ప పట్టణం గంగానగర్‌లో నివాసం వుంటున్న అరుణ (24) రాజా అనే వ్యక్తిని నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకుంది. అయితే ఇంతవరకు సంతానం కలుగలేదని తరచూ బాధ పడేది. సోమవారం కెంచన గుడ్డ గ్రామం వద్ద తుంగభద్ర నదికి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన చోట నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సిరుగుప్ప పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అందరి సహకారంతోనే హెచ్‌ఐవీ నియంత్రణ



మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె

● సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ,డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా అరికట్టడానికి అందరి సహకారం అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ రాజేష్ హొసమనె అన్నారు. మంగళవారం నగరంలోని బీడీఏఏ ఫుట్‌బాల్ హాల్లో విముక్తి ఎయిడ్స్ నివారణ మహిళా సంఘం, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 40 ఏళ్లగా భారత్‌తో పాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో విజృంభిస్తున్న ఎయిడ్స్ నియంత్రణకు పలు సంస్థలు భాగస్వాములు కావాలన్నారు. అవగాహన లేకే కొందరు హెచ్‌ఐవీకి బలవుతున్నారన్నారు. హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని రూపొందించేందుకు సమాజంలో మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ యువతకు హెచ్‌ఐవీ ప్రభావం, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేద్దామన్నారు. ఎన్నో ఏళ్లుగా జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా విముక్తి సంఘం నిరంతరం అవగాహన కల్పిస్తూ మహిళలకు సకాలంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల్లో ఇళ్ళు మంజూరు చేయడం, ఆర్థిక సౌకర్యాలు కల్పించేందుకు వివిధ శాఖల రాయితీ పథకాలు ప్రవేశపెట్టడం, రేషన్ కార్డులు వంటి సామాజిక సేవా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. హెచ్‌ఐవీ పట్ల ఉన్న అనుమానాన్ని, వివక్షను తొలగించే దిశగా సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఇంద్రాణి, యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ గౌరీ, విముక్తి సంఘం దురుగమ్మ, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ దినేష్‌గుడి, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఓపెన్ డ్రైనేజీ వంతెన

● వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



వడ్డర బండ ప్రాంతంలో కూలిన వంతెన

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే నగరంలో ప్రధాన రహదారుల వంతెనల నిర్మాణాలతో కొన్ని రోజులుగా వాహన సంచారానికి త్రీవ ఇబ్బంది ఏర్పడుతోంది. వాహన, జనరద్దీ కారణంగా నగర ప్రజలు ఊరిపి పీల్చుకోలేక పోతున్నారు. నగరంలోని వడ్డరబండ వద్ద పెద్ద మురికి కాలువపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు మరింత అంతరాయం ఏర్పడింది. బెంగళూరు రోడ్డు, కాళమ్మ వీధి వైపు వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వడ్డర బండ సమీపంలోని భారత్ బిస్కెట్ ఫ్యాక్టరీ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సుమారు 60ఏళ్ళ క్రితం ఈ కాలువపై ఈ మార్గంలో పెద్ద రాతిదూలాలతో వంతెన నిర్మించారు. రాత్రి వేళల్లో ఈ మార్గం గుండా భారీ వాహనాలు వెళ్లడంతో వంతెన కూలినట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించి త్వరగా వంతెనను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ: ఎస్ఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శాంతమూర్తి

కంప్లి, డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం తప్పుతుందని ఎస్ఐ శాంతమూర్తి అన్నారు. కుడితిని పట్టణంలో ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మంగళవారం ఆయన వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్టు ధరించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదానికి గురయితే, కుటుంబాలు దిక్కులేనివి అవుతాయని అన్నారు. రోడ్డు దాటే సమయంలో, రోడ్డుపై వెళ్లే సమయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. వాహనానికి లైసెన్స్‌లు, హెల్మెట్లు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఇకపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలన్నారు.

వణికిస్తున్న చలి

కంప్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో చలి పెరిగిపోతోంది. ఉదయం 9గంటల దాకా రహదారులు మంచుతో నిండిపోతున్నాయి. వృద్ధులు, పిల్లలు చలికి వణికిపోతున్నారు. విద్యార్థులైతే తమపాఠశాలలకు చేరుకున్నా పశుగ్రాసాలతో చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందు తున్నారు.



చలిమంట వేసుకుంటున్న విద్యార్థులు

పట్టుబడిన నిందితుడు

రాయచూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కోడలిని హత్య చేసిన నిందితుడు రామలింగయ్య మంగళవారం పోలీసులకు పట్టుబడ్డాడు. తాలూకాలోని జుల్లుంగేరా గ్రామానికి చెందిన రామలింగయ్య తమ కోడలి దుళ్ళమ్మ(27) పై మూడు రోజుల క్రితం అత్యాచార యత్నం చేయగా ఆమె వ్యతిరేకిస్తు తప్పించుకునే ప్రయత్నం చేసింది. ఆమె పై దాడి చేసి హత్య చేసినట్లు రామలింగయ్య పై ఇడపనూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కోడలి మృతి తర్వాత గ్రామం నుంచి పరారైన రామలింగయ్య రెండు రోజుల అనంతరం ఇడపనూరు పోలీసుల చేతికి చిక్కాడు. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



భూమిపూజలో పాల్గొన్న మేయర్ రాజేశ్వరి

అభివృద్ధి పనులకు మేయర్ శ్రీకారం

బళ్లారి సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహానగర కార్పోరేషన్ 34వ వార్డులోని భత్రి ఏరియాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాజీవ్‌గాంధీ నగర్ 15వ ఆర్థిక ప్రణాళిక కింద రూ. 7లక్షలతో భత్రీ బుడా సర్కిల్ నుంచి బ్రిడ్జివరకు , తాగునీటి పైపులైన్‌కు రూ. 5లక్షల వ్యయంతో జియో పైపులైన్ పనులను మాజీ మేయర్, కార్పోరేషన్ సభ్యురాలు ఎం.రాజేశ్వరి సుబ్బరాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త ఎం.సుబ్బరాయుడు, భత్రి మహేశ్, మురళి, భత్రిగౌడ, కృష్ణప్ప, భత్రి పరమేశ్,బోయపాటి విష్ణువర్ధన్,యువజన నాయకుడు యోగానందరెడ్డి,స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జలపాతాలపై అవగాహన తప్పనిసరి

● రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి



విద్యార్థులు, ఉపాధ్యాయులతో రవి చెళ్లగుర్కి

బళ్లారి సిటీ,డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జలపాతాలపై అవగాహన కలిగి ఉండాలని, జోగ్ జలపాతం భారతదేశంలోనే రెండో ఎత్తైన జలపాతమని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం కర్ణాటక జలపాతాల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది జోగ్ జలపాతాన్ని తిలకించడానికి స్వదేశీ, విదేశాల నుంచి పర్యాటకులు సందర్శించి ఆనందిస్తారన్నారు. అవకాశం ఉన్న విద్యార్థులు జలపాతాలను సందర్శించి, వాటి చరిత్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఘటప్రభ నది నుంచి దేకే గోకాక్ జలపాతం కూడా కర్ణాటక రాష్ట్రంలోనే ప్రత్యేకమైనదన్నారు. ఇదే సందర్భంగా రాష్ట్రాన్ని, దేశాన్ని ఏలిన ప్రముఖ రాజుల చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని, శశమ్మ, రామాంజనేయ, గురుప్రసాద్, విజయ ముంద్రగి,విద్యార్థి ప్రతినిధి అనూష తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

సిరుగుప్ప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల నూతన భవన నిర్మాణానికి రూ. 2.50 కోట్లు విడుదల చేయాలని జిల్లా అధికారి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉచ్చీరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో తాలుకా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల భవనం శిథిలావస్థకు చేరుకుందని నూతన భవనానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథ్, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



జాగృతి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా రీసోర్స్ సూపర్‌వైజర్ కుమార్‌వేల్

20న దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం

హోసూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హోసూరులో దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 20న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి హోసూరులో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ర్యాలీలో పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, జిల్లా రీసెర్స్ సెంటర్ సూపర్‌వైజర్ కూమార్‌వేల్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0-18 ఏళ్ల దివ్యాంగులు శిబిరంలో పాల్గొనవచ్చునని, ఇంతవరకు దివ్యాంగుల జాతీయ గుర్తింపు కార్డులు పొందనివారు సైతం నమోదు చేసుకుని ప్రయోజనం పొందాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. అవగాహన ర్యాలీలో దివ్యాంగుల తల్లిదండ్రులు, జిల్లా విద్యాశాఖాధికారుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు సహా 100 మందికి పైగా పాల్గొన్నారు. ర్యాలీ ఏర్పాట్లను జిల్లా కో-ఆర్డినేటర్ బసవరాజు, స్పెషలిస్ట్ ఇన్‌స్పెక్టర్, మెడికల్ సహద్యోగులు పాల్గొన్నారు.

బాగలూరు రోడ్డును బాగు చేయండి



గుంతలమయమైన రోడ్డు ఇదే..

హోసూరు, డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): బాగలూరు సెంట్రల్ రింగురోడ్డు నుంచి బేరికై, మాలూరు, సర్జాపురం, హోసూరు వరకు ఈ రహదారి గుండా పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. ఇటీవల బాగలూరు రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు, ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల దుమ్ము రేగి కళ్లలోకి పడుతోందని ప్రయాణీకులు వాపోతున్నారు. దీని ప్రభావం వాహనచోదకులపై కూడా పడి చిన్నపాటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాక గుంతలపైరోడ్డుపై ట్రాఫిక్ సమస్య మారింది. రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయంలో విశేష పూజలు

హోసూరు డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హోసూరులో లోకకల్యాణం కోసం భక్త మండలి ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. టీవీఎస్ నగర్ సమీపంలోని చిన్నకొత్తూరు ఆంజనేయ స్వామి ఆలయంలో మారుతి మండపంలో ఉదయం 5గంటలకు గణపతి హోమం నిర్వహించారు. అనంతరం వినాయక, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాలను కొలువుదీర్చి 18 మెట్లు ఏర్పాటు చేశారు. అరటి ఆకులపై నెయ్యి దీపాలు వెలిగించారు. అనంతరం కన్నెస్వాములకు, చిన్నారులకు, మాలలు వేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తిగీతాలు, భజనలు పార్యవంశంతో చేశారు. మహామంగళారతి, దీపారాధన నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.



హారతి ఇస్తున్న అర్చకుడు

ఏనుగుల సంచారంతో బెంబేలు

హోసూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలో 30కి పైగా అడవి ఏనుగులు బస చేసినట్టు సమాచారం. కాగా రాగి పంటను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడంతో రైతులలో ఆందోళన నెలకొంది. మరోవైపు ఏనుగును అడవికి తరిమి కొట్టే పనిలో అటవీశాఖాధికారులు నిమగమయ్యారు. ఒంటరి ఏనుగు మంద నుంచి వేరుగా వెళ్లి పంటలను, పొలాలను నాశనం చేస్తోంది. సరిహద్దులోని కర్ణాటక రాష్ట్ర అడవుల నుంచి వచ్చిన ఏనుగుల మంద గుంపులుగా విడిపోయాయి. వీటిలో 35కి పైగా ఏనుగులు రెండు గుంపులుగా గతవారం డెంకణీకోట సమీపంలోని సానమావు అడవులో రావడంతో వాటిని దట్టమైన అడవుల్లోకి తరిమికొట్టారు. మంగళవారం 30కి పైగా ఏనుగుల మంద అదే కొత్తపల్లి గ్రామం మీదుగా తిరుగుతూ బొడిసిపల్లి, సినిగిరిపల్లి గ్రామాలకు ఆనుకుని ఉన్న అడవుల్లో మకాం వేసినట్టు తెలుస్తోంది. దీంతో ఆ ప్రాంతంలోని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖాధికారులు సూచించారు.

మందుబాబులకు అడ్డాగా ట్రావెలర్స్ బంగ్లా

హోసూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): హోసూరు రాయకోట రోడ్డు ప్రాంతం తమిళనాడు ప్రభుత్వ ట్రావెలర్స్ బంగ్లా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. హైవేస్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం పేరిట ఉన్న ఆర్‌అండ్‌బి బంగళా ఆవరణలో ఎటు చూసినా ఖాళీ మద్యం బాటిళ్లు కనిపిస్తున్నాయి. బంగళా పర్యవేక్షణ కొరవడడంతో తాగుబోతులకు అడ్డాగా మారినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ అధికారులు బస చేసే కార్యాలయ ప్రాంగణం దుస్థితికి చేరుకోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సమీపంలోనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, థియేటర్, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలో పడేసిన మద్యం బాటిళ్లు

మైసూరులో 23న రాష్ట్రస్థాయి రైతు సమావేశం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు శివార్జున నాయక్

రాయచూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతు ప్రపంచ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన మైసూరులో రాష్ట్రస్థాయి రైతు సమావేశం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శివార్జున నాయక్ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కనీస మద్దతు ధర చట్టం రైతుల అన్ని రకాల రుణాల మాఫీ, మైక్రో ఫైనాన్స్ వేదింపుల నుంచి రక్షణ తదితర ప్రధానమైన 18 డిమాండ్లతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సు డిల్లీలో జరుగుతున్న రైతు పోరాటాలకు అండగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉపకరణాల పై జీఎస్టీని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రైతు సంఘం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మైసూరులో నిర్వహించే సదస్సుకు రాష్ట్రం రైతులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా నుంచి రైతు సంఘాల ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

దిగుబడి లేదు.. పెట్టుబడి రాదు..!

● వరి రైతుకు తుఫాన్ దెబ్బ ● అమాంతం తగ్గిన ధరలు.. గిట్టుబాటు కాదని అన్నదాత ఆవేదన



పొలాల్లోనే ధాన్యం అమ్ముతున్న రైతులు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ సారి వరిపంట బాగా పండుతుందని, మంచి దిగుబడి వస్తుందని, లాభాలు గడించవచ్చని ఆశించన రైతులకు నిరాశే మిగిలింది. నవంబర్, డిశంబర్ నెలల్లో వచ్చిన తుఫాన్లు వరి రైతును నిండా ముంచాయి. రాష్ట్రంలో సామాన్యంగా సోనామసూరి, ఆర్‌ఎన్‌ఆర్‌లతో పాటు వివిధ రకాల వరి రకాలు పండిస్తున్నారు. ఈ రకమైన పంటలు ఎకరాకు సరాసరి 28 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తాయి. అయితే కోతల దశలోనే తుపాన్లు ముంచెత్తడంతో దిగుబడి బాగా తగ్గింది. కొన్నిజిల్లాల్లో చేతికొచ్చిన పంట కూడా వర్షం కారణంగా కొట్టుకుపోవడం, మొలకలెత్తడం తదితర కారణాలతో అన్నదాతకు నష్టాలు తప్పలేదు. గత ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో క్వింటాల్‌కు వరికి రూ 2,183 నుంచి 2,203 వరకు కనిష్ట మద్దతు ధర నిర్ణయించగా, కేంద్ర ప్రభుత్వం ఈ సారి క్వింటాల్ రూ 2,300 నుంచి రూ 2,320 నిర్ణయించింది. ఎకరాకు కనీసం25క్వింటాలు, ప్రతి రైతు నుంచి గరిష్టంగా 50 క్వింటాళ్ళ వరి దిగుబడి రాగా. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2.24లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు జరిగినట్లు వ్యవసాయ గణాంకాలు తెలుపుతున్నాయి. వరికొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు నిర్ధిష్టం చేయడంతో... ఎక్కువ ప్రమాణంలో వరి సాగుచేసిన రైతులు మార్కెట్‌లోనే వరిధాన్యం అమ్ముకోవాల్సి ఉంటుంది. గత ఏడాది మార్కెట్‌లో రూ 3వేల వరకు ధర పలుకగా, ప్రస్తుతం ఏడాది క్వింటాల్‌కు రూ 1800 నుంచి రూ 2000 వరకు ధర పలుకుతోంది. దీంతో అరకొర పండిన పంటకు కూడా గిట్టుబాటు ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరా వరి సాగుకు సామాన్యంగా రూ38వేల నుంచి 42వేల వరకు ఖర్చు వస్తోంది. ఈసారి వరి పంట దెబ్బతినడంతో వరికోతలు కోయడానికి కోతమిషన్‌లు ఎక్కువ పనిచేయడంతో యంత్రాల అద్దె భారమవుతోంది. వర్షం కారణంగా కొన్ని చోట్ల పంటలు దెబ్బతినడంతో వరి పంట నాణ్యత తగ్గిపోవడంతో ఎకరాకు కనీసం 4నుండి 7 క్వింటాళ్ళ దిగుబడి తగ్గిందని దీంతో 30నుండి 35 క్వింటాళ్ళకు వచ్చే పంట 25 క్వింటాళ్లలోపు పడిపోయిందని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రస్తుతం పెట్టుబడి ఎకరానికి రూ 42వేలు దాటిందని, మరోవైపు దిగుబడి తగ్గడంతోపాటు ప్రస్తుతం మార్కెట్‌లో ధర పడిపోవడంతో ఎకరాకు రూ 45వేల నుండి 50వేల వరకు రాబడి వచ్చే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రాత్రి, పగలు కష్టపడి పండించిన పంటకు కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి తెలంగాణాలో తలెత్తడంతో వరి రైతులకు అక్కడి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ 500 ప్రోత్సాహక ధనం ప్రకటించిందని, అదే రీతిలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంకూడా ప్రోత్సాహక ధనం అందజేసి రైతులను ఆదుకోవాలని బళ్ళారి జిల్లా రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వరికొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉంటాయని, దళారీలకు ముకుతాడు వేసినట్లు అవుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం రైతులు వరికొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని పోరాటాలు చేస్తేనే ప్రారంభించేందుకు పూనుకుంటుందని, అలా కాకుండా ప్రభుత్వం శాశ్వతంగా వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు కృషి చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పంటనష్టంపై జాయింట్ సర్వే..

రాష్ట్రంలో పంటనష్టానికి సంబంధించి వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు జాయింట్ సర్వే జరిపినా ఆయా జిల్లాధికారులు నష్టానికి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. బళ్లారి జిల్లాలో 1845 మంది రైతులకు సంబంధించి 651 హెక్టార్ల ప్రాంతంలో వరినష్టపోయినట్లు, ఈ నష్టం సుమారు రూ1.08కోట్ల రూపాయలు పరిహారం విడుదల చేయాలని ప్రభుత్వానికి తెలిపినట్లు వ్యవసాయ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.